క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. బీబీబజార్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు. ఆస్రా ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. పంజేషా, గుల్జార్‌హౌస్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు. ఆలిజాకోట్లా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రక్షాపురం, ఫలక్‌నుమా ఓహెచ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. నసీబ్‌నగర్, ఫలక్‌నుమా యాజీసీ, ఫాతిమానగర్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. మశ్రత్ ఫంక్షన్ హాల్, బాయ్స్‌టౌన్, కందికల్‌గేట్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బండి సంజయ్‌కి శుభాకాంక్షలు



సుల్తాన్‌బజార్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బండి సంజయ్‌ని సోమవారం బీజేపీ నాయకుడు సందీప్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బండి సంజయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా గ్రీన్ డే



గౌలిపురా: శాలిబండ బేలాలోని స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో సోమవారం గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రీన్ కలర్ దుస్తులతో పలు వేషధారణలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ అవగాహన కల్పించారు. పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన జాయింట్ కమిషనర్



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం నగర జాయింట్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ సందర్శించారు. ఈ సందర్భంగా పునర్విభజనలో భాగంగా ప్రజల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను అడిగి తెలుసుకున్నారు. నూతన పరిధిలో భాగంగా ఇతర పోలీస్‌స్టేషన్ల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్ర, డీఐ గోపాల్, ఎస్సై నర్సింగ్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సోమవారం నిర్వహించిన అమరవీరుల స్మారక కార్యక్రమంలో ఉప్పుగూడ శాంతి నికేతన్ పాఠశాల విద్యార్థులు పాల్గొని మూడు అవార్డులు అందుకున్నట్లు కరస్పాండెంట్ ప్రతాప్ శాలినీ తెలిపారు. అమరవీరులపై సందేశం, రంగోలీ పోటీ, దేశభక్తిని చాటే వేషధారణలతో విద్యార్థులు పాల్గొన్నారు. దేశభక్తికి సంబంధించిన అంశంలో పాతబస్తీ నుంచి తమ పాఠశాలకు ఆహ్వానం అందడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శస్త్ర చికిత్సలకు కావాల్సిన నిధులను ముఖ్యమంత్రి తన సహాయ నిధి ద్వారా పేదలకు అందిస్తున్నారన్నారు. అయితే ఇవి నగదు రూపేనే కాకుండా నిమ్స్ ఆస్పత్రిలో కానీ, ఇతర ప్రభుత్వం గుర్తించిన ఆస్పత్రుల పేరిట చెక్కులు అందిస్తారన్నారు.

కొత్త ఇన్‌స్పెక్టర్ల పదవీ బాధ్యతల స్వీకరణ

సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా శివచంద్ర



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శివచంద్ర సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.రమేశ్ కుమార్ పదోన్నతిపై వెళ్లారు.

కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్‌గా శేఖర్‌రెడ్డి



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్ పని చేసిన ఆనంద్ కిశోర్ బదిలీపై మల్టీ జోన్‌కు వెళ్లగా ఆయన స్థానంలో ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పని చేస్తున్న శేఖర్‌రెడ్డిని పదోన్నతిపై కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా రవీందర్



అబిడ్స్: షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నాగం రవీందర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లకు పైగా విధులు నిర్వహించిన అజయ్‌కుమార్ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కావడంతో స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్న నాగం రవీందర్‌ను నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్



అబిడ్స్: మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.రవికుమార్ పదవీబాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన నూనవత్ రవి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో స్పెషల్‌బ్రాంచిలో పనిచేస్తున్న రవికుమార్‌ను నియమించారు.

హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్‌గా నాగేశ్వర్‌రెడ్డి



దూద్‌బౌలి: హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్‌గా సి.నాగేశ్వర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేశ్ కుమార్ ఎస్‌బీకి బదిలీ కావడంతో ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వర్‌రెడ్డి హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.

మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న శివకుమార్ బదిలీపై రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సౌత్, వెస్ట్ పీసీఆర్‌లో పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

భవానీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా రవీందర్



గౌలిపురా: భవానీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.రవీందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన మహ్మద్ అంజద్ అలీ ఎస్‌బీకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో ఎస్‌బీలో పని చేస్తున్న రవీందర్‌ను భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ రహమాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: విధి నిర్వహణలో అందరి సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానని గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రహమాన్ అన్నారు. గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓగా నియమితులైన సందర్భంగా బీజేపీ నాయకులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి అభినందించారు.

సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వీడ్కోలు



సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావును ప్రభుత్వం ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేయడంతో సోమవారం ఆయనకు ట్రాఫిక్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయనకు పూలవాన కురిపించి ఘనంగా వీడ్కోలు పలుకుతూ.. ఆయన చేసిన విధులను సిబ్బంది కొనియాడారు. అలాగే ఆయన స్థానంలో ఇన్‌స్పెక్టర్ రాంబాబు సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఒకరికి వీడ్కోలు పలుకుతూ మరొకరికి స్వాగతం పలికారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వర్షా కాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయం బల్దియా మలేరియా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రెండేళ్లుగా దోమలు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని, వర్షాలు కురుస్తుండటంతో దోమలు మళ్లీ విజృంభిస్తున్నాయన్నారు. కలరా, డెంగీ వ్యాధులతో ప్రజలు అసలే రోగాలబారినపడ్డారని, దోమలతో మళ్లీ మలేరియా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం ఉందని ఆయన అన్నారు. పారిశుద్ధ్య పనులు ప్రతినిత్యం జరిగేలా తాను బల్దియా కమిషనర్‌ను కలిసి కోరానన్నారు. రోడ్లపై ఓవైపు బురద, మరోవైపు చెత్త కుప్పలు, దోమలు పెరగడానికి అవకాశం కల్పిస్తున్నాయన్నారు. గోల్కొండ కోట శాతం చెరువు, కోట కందకాలు, బుల్కాపూర్ నాలా, మూసీనది పరీవాహక ప్రాంతాల్లో ప్రతినిత్యం దోమల మందును స్ప్రే చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అర్బన్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, సీనియర్ ఎంటమాలజిస్ట్ కె.రజనీ తదితరులున్నారు.

మెహిదీపట్నం డీఎంగా జీవీ కృష్ణమూర్తి



గోల్కొండ: మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జీవీ కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన సూర్యనారాయణ బదిలీపై జహీరాబాద్ డిపోకు వెళ్లారు. కాగా పరకాల డిపో నుంచి బదిలీపై వచ్చిన జీవీ కృష్ణమూర్తి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిపోకు చెందిన సీనియర్ అధికారులు ఆయనను కలిసి అభినందించారు.

న్యాయవాదులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

గోల్కొండ: న్యాయవాదులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. తెలంగాణ అడ్వకేట్ ఫోరం ఫర్ జస్టిస్ సభ్యులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా యువ న్యాయవాదులు వృత్తిలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, పవిత్రమైన న్యాయవాద వృత్తిని నమ్ముకుని వారు ఎందరో పేదలకు న్యాయసేవలు అందిస్తున్నారని ఫోరం చైర్మన్, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు వహీద్ అహ్మద్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. న్యాయవాదుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. న్యాయవాదులు మీర్ వాజిద్ అలీఖాన్, వలీ ఉర్ రహమాన్ తదితరులున్నారు.

పేదల సంక్షేమానికి మజ్లిస్ పార్టీ కృషి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్

దూద్‌బౌలి: పేదల సంక్షేమానికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం ఉర్దూఘర్‌లో షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. 147 మంది లబ్ధిదారులకు రూ.1.47 కోట్ల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బీసీ, దళిత, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ, శాలిబండ కార్పొరేటర్ ముజఫర్ అలీ ముస్తాఫా, మజ్లిస్ పార్టీ నాయకులు కె.శ్రీనివాస్, రహీం, ముజ్జు, బాకర్ అలీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రషీద్ పాల్గొన్నారు.

బీసీని ముఖ్యమంత్రిని చేయాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రిని చేయాలన్న డిమాండ్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో తెలంగాణ సమాజ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీసీల రాజ్యాధికారం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఉద్భవిస్తే బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని భావించాం కానీ ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికార పార్టీ నాయకులు చెరువులు, భూములను కబ్జాలు చేస్తున్నట్లు ఆరోపించారు. డల్లాస్, న్యూయార్క్ చేస్తామని ప్రకటనలే తప్పా అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. అకాల వర్షం వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకుల పరీక్షలు ఒకొక్క పేపర్ ఒకొక్క ఊరిలో నిర్వహిస్తున్నారని ఇందు వల్ల అభ్యర్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తెలంగాణ సమాజ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్‌గౌడ్, బీజేపీ బీసీ మోర్చ నాయకులు ఆలె భాస్కర్, ప్రొఫెసర్ పిఎల్. విశ్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కుల్సుంపురా ఏసీపీగా మహ్మద్ అబ్దుల్ జావేద్



అబ్దుల్ జావేద్‌కు మొక్కను అందజేసిన అశోక్‌కుమార్

జియాగూడ: కుల్సుంపురా డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా శాంతిభద్రతలకు చర్యలు తీసుకుంటామని కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ అబ్దుల్ జావేద్ అన్నారు. సోమవారం చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన మహ్మద్ అబ్దుల్ జావేద్ ప్రమోషన్‌పై ఏసీపీగా కుల్సుంపురా డివిజన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ ఆయనకు పూలమొక్కను అందజేసి అభినందించారు.

భారత పారా సైక్లింగ్ జట్టుకు కోచ్‌గా దత్తాత్రేయ



చార్మినార్: తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ భారత పారా సైక్లింగ్ జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ మనీందర్ పాల్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఆగస్టు 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే 13వ యూసీఐ వరల్డ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్న భారత పారా సైక్లింగ్ జట్టు సభ్యులు అర్షద్ షేక్, ప్రశాంత్, జ్యోతిలకు శిక్షణ ఇవ్వనున్నారు.

అన్నదానం

గోల్కొండ: స్నేహితులు, దాతల సహకారంతో విరామం లేకుండా 500 రోజులుగా అన్నదానం చేస్తున్నానని సంఘసేవకుడు, గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రితో పాటు ఇతర ప్రైవేటు ఆస్పత్రుల వద్ద పేషెంట్ల సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహచరులు, విశ్రాంత ఉద్యోగులు, ఇతర దాతల సహకారంతోనే ప్రతినిత్యం వందద మందికి భోజన ప్యాకెట్లు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు.



హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘాల ఎన్నికలు



ఎంపికైన వారిని అభినందిస్తున్న సభ్యులు

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘాల సమైక్య ఎన్నికల్లో అధ్యక్షులుగా కొప్పు పద్మ, ఉపాధ్యక్షులుగా బైరి వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయనగర్‌కాలనీలోని రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయం వద్ద అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం రాబోయే ఐదేళ్లల్లో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా కృషి చేయాలని, నగరంలోని ప్రజలకు పౌష్టిక ఆహారమైన చేపలు అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళికలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు కర్రెల్లి లలిత, ముఠా దశరథ, పూస నాగమణి, మెట్టు విజయలక్ష్మి, కట్ట లింగం, సుధారాణి, అరుణ, వరలక్ష్మి, సంఘం నాయకులు అర్వపల్లి శ్రీరాములు, గుడిపల్లి కనకతార, చంద్రి, పుష్ప, బి.బాలమణి, రాజమణి, కె.శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్‌కు ఆదరణ



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన మోచి సమాజ్ వాసులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, సంక్షేమంతో బీఆర్ఎస్ వైపు అన్నివర్గాల ప్రజలు మొగ్గు చూపుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. చుడీబజార్‌లో మోచీసమాజ్‌కు చెందిన దాదాపు 100 మంది నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా బీఆర్ఎస్ పటిష్టంగా ఉందన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. మురికివాడలు, బస్తీల్లో కేసీఆర్ ప్రభుత్వ పథకాలను అందరికీ అందించేందుకు ప్రతిరోజూ పర్యటిస్తునట్లు వెల్లడించారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, శంకర్‌సింగ్ జమేదార్, కోటి శైలేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

దేవదాస్ కనకాల, డీఎస్.దీక్షిత్‌ల స్మారకోపన్యాసం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో సోమవారం రంగస్థల కళల శాఖ పూర్వ శాఖాధిపతులు, కీర్తిశేషులు దేవదాస్ కనకాల, పూర్వ అధ్యాపకులు డీఎస్.దీక్షిత్ జయంతి సందర్భంగా తెలుగు వర్సిటీ సమావేశ మందిరంలో స్మారకోపన్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. లలిత కళాపీఠం పీఠాధిపతి ఆచార్య కోట్ల హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభకు ప్రసంగకర్తగా డాక్టర్ ఎల్వీ భూషణ్ పాల్గొని స్మారకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళల శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మప్రియ, శ్రీధర్ దీక్షిత్, మల్లాది గోపాలకృష్ణ, కల్యాణి పాల్గొన్నారు. డాక్టర్ ఆర్.ఆర్.హరిశ్చంద్ర వ్యాఖ్యాతగా వ్యవహరించగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు ఆంథోని వందన సమర్పణ గావించారు.



మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ ప్రతినిధి అన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యూనిటీ చీఫ్ కన్వీనర్లు రాధా మైథ్యూస్, ఆదాంరాజ్, ప్రవీణ్, సుధీర్ మాట్లాడారు. మణిపూర్‌లో స్త్రీలపై జంతువుల వలే ప్రవర్తించిన ఆ కామాంధులకు కఠిన శిక్షలు వేయాలని వారు డిమాండ్ చేశారు. మణిపూర్ సీఎం, ప్రధాని నరేంద్రమోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెరుసలం మత్తయ్య, గ్రేస్, స్వరూప, ప్రవీణ్, ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఏఎన్ఎంల సమ్మెకు పిలుపు



కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

సుల్తాన్‌బజార్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసిన తర్వాతే పర్మనెంట్ పోస్టుల భర్తీ చేయాలని లేని పక్షంలో ఆగస్టు 15 నుంచి కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమ్మెకు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి ఎండీ ఫసియుద్దీనప్, కె.యాదా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్‌లో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కవిత, సుధాకర్, కిరణ్మయ్, సంపూర్ణ, సరోజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో నిత్యాన్నదానం

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ నిస్వార్థంగా పేదలకు సేవ చేస్తుందని లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంచాలకులు డాక్టర్ జి.బాబురావు అన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో లయన్స్ భోజనాలయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి ఏ ఆపద వచ్చినా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందిస్తామన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఆర్.మల్లారెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్వినిమార్గం, కార్యదర్శి సాయినాథ్, లయన్స్ క్లబ్ మీడియా చైర్మన్ ఆకుల రవీందర్‌రావు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన్ని ప్రారంభిస్తున్న బాబురావు

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆయాచితం శ్రీధర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్కళా భారతి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త వడ్డేపల్లికృష్ణ రచించిన భాగ్యనగర్-వెలుగచ్చింది. పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిపై నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, తెలుగు విశ్వ విద్యాలయం నాటక శాఖాధిపతి కోట్ల హన్మంతరావు, సత్కళాభారతి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌కు సత్కారం



మనోహర్‌ను సత్కరిస్తున్న జస్టిస్ డాక్టర్ చంద్రయ్య, జస్టిస్ ఎంఎస్‌కే.జైస్వాల్ తదితరులు

అబిడ్స్: హెల్పర్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో యోగా గురువు బొడ్డు మనోహర్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. 30 ఏళ్లకు పైగా వేలాదిమందికి యోగాసనాల ద్వారా ఆరోగ్య పదిలం, ఆరోగ్యంపై అవగాహన కల్పించిన బొడ్డు మనోహర్‌కు ఉత్తమ యోగా గురువు అవార్డును అందజేశారు. జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య, జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్‌లు ఆయనకు మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంతసేపు అయినా యోగాసనాలు చేస్తే ఆరోగ్యకర జీవితం పొందుతారన్నారు.